తాగునీటిలో జలగలు వస్తున్నాయ్..

అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం

తాగునీటిలో జలగను చూపిస్తున్న గ్రామస్తులు

రుద్రూర్, నవంబర్ 15 : మండలంలోని కొండాపూర్ గ్రామంలో తాగునీటిలో పురుగులు, జలగలు వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. మోటర్ కాలిపోవడంతో తాగునీటికి కటకట ఏర్పడిందని, మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. మోటర్‌ను బయటికి తీసి చాలా రోజులు వదిలేయగా.. గ్రామస్తులంతా పదేపదే కోరడంతో రిపేరు చేయించారని తెలిపారు. సరఫరా చేస్తున్న తాగునీటిలో పురుగులు, జలగలు వస్తున్నాయని, ట్యాంకు అపరిశుభ్రంగా మారతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

డిచ్‌పల్లి, నవంబర్ 15: ఆర్మూర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో అండర్-14, 17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ విభాగంలో డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దశరథ్ తెలిపారు. అండర్ -17 సాఫ్ట్‌బాల్‌లో కళ్యాణ్, బేస్‌బాల్‌లో ప్రేమ్‌దాస్, అండర్-14 బేస్‌బాల్‌లో కార్తీక్, సాఫ్ట్‌బాల్‌లో సాయివినయ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను పీడీ కోటాల సంజీవ్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అశోక్, మహేశ్, గంగప్రసాద్, రాణి, కుల్‌దీప్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో డిగ్రీ విద్యార్థిని ప్రతిభ

ధర్పల్లి, నవంబర్ 15 : శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 'ధనం వస్తుంది – పోతుంది' నీతి వస్తుంది – విస్తరిస్తుంది' అనే అనే అంశంపై ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మైథిలి జిల్లాస్థాయిలో మూడో స్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైనట్లు సమితి మండల కన్వీనర్ ఎం. శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలోని సత్యసాయి మందిరంలో బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రేమ్‌లాల్‌కు అవార్డు ప్రదానం

ఖిలీల్‌వాడి, నవంబర్ 15 : జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్‌కు విజయవాడకు చెందిన అర్పిత సమితి ఆధ్వర్యంలో గతనెల 21న వివేకానంద అవార్డును ప్రకటించారు. అనివార్య కారణాలతో అక్కడికి వెళ్లకపోవడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయనకు అందజేశారు. సామాజిక సేవలకు గాను ఆయనకు అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

భగవాన్ బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ అంకిత్
- ఏకలవ్య పాఠశాలలో గిరిజన గౌరవ దినోత్సవ సమారోహము

ఇందల్వాయి, నవంబర్ 15 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన యోధుడు భగవాన్ బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో నిర్వహించిన గిరిజన గౌరవ దినోత్సవ సమారోహము కార్యక్రమం, బిర్సా ముండా 150వ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థిలో ఏదో ప్రతిభ ఉంటుందని, దానికి పదునుపెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదివి తమ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్‌కుమార్, డీటీవో నాగోబారావు, గంగారాంనాయక్, జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్, తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఆర్ఐ మోహన్‌తో పాటు పశు వైద్యాధికారి గంగామోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నృత్యం చేస్తున్న విద్యార్థులు

26న నిరసన ప్రదర్శనకు తరలిరావాలి

డిచ్‌పల్లి, నవంబర్ 15 : కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవంబిస్తున్నదని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల్లో రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన డిచ్‌పల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4 కోడ్‌లుగా కుదించి వారి హక్కులను కేంద్రం కాలరాస్తున్నదని విమర్శించారు. ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలపై దెబ్బ కొడుతున్నదన్నారు. కార్మిక రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో 26న నిరసన ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గంగాధర్, పీవైఎల్ జిల్లా నాయకుడు దాస్, ఏఐకేఎంఎస్ నాయకులు బుచ్చన్న, గంగాధర్ పాల్గొన్నారు.

దీక్ష విరమించిన పిట్ల కృష్ణ మహరాజ్

సారంగాపూర్, నవంబర్ 15 : మండలంలోని మల్లారం గ్రామశివారులో ఉన్న లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ 22 రోజులపాటు చేపట్టిన కార్తీకమాస దీక్ష శుక్రవారం రాత్రి విరమించారు. బయటికి వచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఆవరణలో ఉన్న శివాలయంలో భక్తులు దీపారాధన చేపట్టారు. నేడు పిట్ల కృష్ణ మహారాజ్ లింగేశ్వర గుట్ట ఆశ్రమానికి వచ్చి భక్తులతో కలిసి పాదయాత్రగా కందకుర్తికి చేరుకోనున్నారు. అక్కడ త్రివేణి సంగమ తీరంలో లింగాభిషేకం, సామూహిక గంగాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆశ్రమ కమిటీ సభ్యులు వివరించారు. ఈనెల 17న లింగేశ్వర గుట్ట ఆశ్రమంలో అన్నదానం కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

మల్లారం వద్ద రోడ్డు ప్రమాదం

- వ్యాన్‌ను ఢీకొన్న లారీ
- వ్యాన్‌లో ఇరుక్కొని డ్రైవర్ మృతి
- గంటకుపైగా శ్రమించి మృతదేహం వెలికితీత

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

వినాయక్‌నగర్, నవంబర్ 15: నిజామాబాద్ మండల పరిధిలోని మల్లారం అటవీ ప్రాంతంలో లారీ, వ్యాన్ ఢీకొనగా ఒకరు మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకోగా.. రూరల్ ఎస్సై ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడలో బీడీ కార్ఖానా నడిపిస్తున్న గోపాల్ (55) రోజు మాదిరిగా తన వ్యాన్‌లో బీడీలు తీసుకుని నిజామాబాద్ మండలం మల్లారం ప్రాంతంలో ఉన్న దేశాయి బీడీ కంపెనీకి బయల్దేరాడు. వ్యాన్‌ను అతడే డ్రైవింగ్ చేస్తూ వస్తుండగా.. మల్లారం అటవీ ప్రాంతంలో బాడ్సీ నుంచి వడ్లు తీసుకుని వర్ని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపాల్ వ్యాన్‌లో ఇరుక్కుపోయి మృతిచెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్సై ఆరీఫ్, తన సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నాడు. వ్యాన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికి తీసేందుకు స్థానికుల సహాయంతో గంటకు పైగానే శ్రమించారు. చివరకు బయటికి తీయించి 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి.. పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రోడ్డు కిందకు దూసుకెళ్లిన బస్సు

వినాయక్‌నగర్, నవంబర్ 15: నిజామాబాద్ ఆర్టీసీ డిపో-1కు చెందిన బస్సు అదుపు తప్పి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నది. నిజామాబాద్ నుంచి ప్రయాణికులతో బయల్దేరిన ఆర్టీసీ బస్సు బైపాస్ రోడ్డులో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్లపొదల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో బస్సు ముందుభాగంలోని అద్దం ధ్వంసం కాగా.. ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్‌కు కళ్లు తిరిగినట్లు కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. బస్సులోని ప్రయాణికులు క్షేమంగానే ఉన్నట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

సంక్షిప్తంగా..

- **పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గం:** ఖిలీల్‌వాడి, నవంబర్ 15 : నగరంలోని గాజుల్‌పేట్ రాంమందిర్ 13వ తర్ప పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎనగందుల సుభాష్, ప్రధాన కార్యదర్శిగా ఎనుగందుల మోహన్, కోశాధికారిగా అచ్చుగట్ల నారాయణ, ఉపాధ్యక్షులుగా శ్రీరాంబాలకృష్ణ, బాలె శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా ఎనుగందుల గంగాధర్, గోస్కె దత్తాద్రి, పట్టణ ఈసీగా మార పండరి, సభ్యులుగా గోస్కె తులసి, తుమ్మ సత్యనారాయణ, దేవసాని సుదర్శన్, ఎనగందుల గంగాధర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గోస్కె శంకర్ వ్యవహరించారు.
- **భగవంతుడి పై విశ్వాసం ఉండాలి:** సుభాష్‌నగర్, నవంబర్ 15: భక్తి శ్రద్ధలతో భగవంతుడిని కొలిస్తే కోరుకున్న చోటికి వస్తాడని శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవ కార్యక్రమానికి ఆయనతోపాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్పర్సన్ సరళ మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చామకూర ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు తులసీ కృష్ణమాచార్యులు, డాక్టర్ సముద్రాల శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.
- **గంథాలయాలంలో పుస్తక ప్రదర్శన:** ఖిలీల్‌వాడి, నవంబర్ 15 : 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. శనివారం అధ్యాత్మికవేత్త డాక్టర్ చిరంజీవి పుస్తక ప్రదర్శనకు హాజరై మాట్లాడారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పాఠకులకు అధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఏర్పడి అనుకున్న లక్ష్యాసాధన సులభతరం అవుతుందన్నారు. సహాయ గ్రంథపాలకుడు పట్టెం మధు, సిబ్బంది స్వామి, గంగారాం పాల్గొన్నారు.
- **విఠలేశ్వర స్వామి కల్యాణోత్సవం:** రుద్రూర్, నవంబర్ 15 : మండలంలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ రుక్మిణీ పాండురంగ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పండరీపూర్ సంప్రదాయాన్ని అనుసరించి నెల రోజులుగా అర్చకులు రామశర్మ కులకర్ణి, పవన్ శర్మ ఆధ్వర్యంలో కాకడ హారతి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

డీసీసీబీ వైస్‌చైర్మన్‌కు సన్మానం

బాల్కొండ, నవంబర్ 15: జలాల్‌పూర్ గ్రామంలో శుక్రవారం డీసీసీబీ వైస్‌చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి శ్రీరంగనాథ స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ క్యాతం కిషన్‌గౌడ్, లిఫ్ట్ చైర్మన్ గడ్డం గంగారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ గచ్చంద అనిల్, లింబారెడ్డి, వార్డు సభ్యులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మోర్తాడ్, నవంబర్ 15: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో శ్రీ షిరిడిసాయి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న భక్తులు

దివ్యాంగులకు రూ.ఆరువేల పింఛన్ అందించాలి

నవీపేట,నవంబర్ 15: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ. ఆరు వేల పింఛన్ అందించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఆసరా పింఛన్లపై చర్చించారు. దివ్యాంగుల పింఛన్లను పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని ఆమె గుర్తు చేశారు. హామీని నెరవేర్చకపోతే దివ్యాంగులతో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ధర్పల్లి/రెంజల్, నవంబర్ 15: కుల గణన సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో బాలకృష్ణ ఎన్యుమరేటర్లకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. రెంజల్ మండలంలోని దండిగుట్ట, కల్యాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

ఘనంగా వాడీ గంగాధరయ్య జాతర

ధర్పల్లి, నవంబర్ 15 : మండలంలోని వాడి గ్రామ పరిధిలో ఉన్న గురు గంగాధరయ్య స్వామి ఆలయ వార్షికోత్సవాలు, జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. మధ్యాహ్నం జాతరకు తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లను వాడి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

18న తహసీల్ కార్యాలయం ముట్టడి

మాట్లాడుతున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్, నవంబర్15: మధ్యాహ్న భోజన కార్మికులపై హెడ్మాస్టర్ కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలని, ముందుగా హెడ్మాస్టర్ వనజారెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న ఆర్మూర్ తహసీల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

రెంజల్, నవంబర్ 15: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన యువకుడు కార్తిక్ యాదవ్ శుక్రవారం పుట్టిన రోజు సందర్భంగా కేజీబీవీ విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. చదువుతోపాటు ఆటల్లో రాణించాలన్న ఉద్దేశంతో వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, లచ్చేవార్ నితిన్, ఎంఎల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

ఎడపల్లి, నవంబర్ 15: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో ఎడపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు న్విహించారు. 18 మందికి మోతి బిందువు ఉన్నట్లు గుర్తించారు. వారిని కంటి ఆపరేషన్ నిమిత్తం వారికి బోధన్‌లోని లయన్స్ క్లబ్ కంటి దవాఖానకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, కాశీనాథ్, ప్రకాశ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్15: కార్తీకపౌర్ణమిని శుక్రవారం జిల్లాలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తులసి మొక్కల వద్ద కార్తీకదీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుహాసినిలకు వాయనం ఇచ్చిపుచ్చుకున్నారు. నోము కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, నెహ్రూ పార్కులోని శంభు లింగేశ్వరాలయం, శ్రద్ధానంద్ గంజ్ ఉమామహేశ్వరాలయం, న్యాల్‌కల్ రోడ్ లలితాదేవి ఆశ్రమాలయం, నాగారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, గంగాస్టాన్ ఫేస్ -2 ఉత్తర తిరుపతి గణపతి ఆలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరినదికి వివిధ ప్రాంతాల భక్తులు వచ్చి పూజలు నిర్వహించారు. గంగాహారతి జిల్లా అధ్యక్షుడు రచ్చ తిరుపతి, సీతారాం త్యాగి మహరాజ్ గోదారమ్మకు మహా హారతినిచ్చారు. సీతారాం త్యాగి మహరాజ్ ఆశ్రమాన్ని దర్శించుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నవీపేట మండలంలోని బినోలా వద్ద గోదావరి నదికి హారతి ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు.

నగరంలోని నీల కంఠేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న అర్చకులు, మహిళలు

మోర్తాడ్ మండలం వడ్యాట్ శివాలయంలో ..

బోధన్ పట్టణంలోని చక్రేశ్వర శివాలయం వద్ద భక్తులు..

కందకుర్తి వద్ద గోదావరికి మహా హారతినిస్తున్న జిల్లా అధ్యక్షుడు రచ్చ తిరుపతి

బోధన్ మండలం పెంటకుర్దూ గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో..

పొతంగల్‌లోని బాలాజీ మందిరంలో సహస్ర దీపారాధనలో పాల్గొన్న మహిళలు

ఉమ్మెడ వద్ద గోదావరి నదిలో మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

బోధన్ ఉర్దూఘర్ పాలకవర్గం..

బోధన్, నవంబర్ 15: పట్టణంలోని అల్లామా ఉర్దూఘర్‌కు మేనేజ్‌మెంట్ కమిటీని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ నియమించారు. ఈ మేరకు ఉర్దూఘర్ అధ్యక్షుడిగా నియమితులైన సయ్యద్ లియాఖత్ హుస్సేన్, ఇతర కమిటీ సభ్యులకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నియామక పత్రాలను పట్టణంలోని ఉర్దూఘర్‌లో శుక్రవారం అందించారు. ఉర్దూఘర్ కార్యదర్శిగా ఖుర్షీద్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా షేక్ వహీద్, సభ్యులుగా ఎజాజ్ హుస్సేన్, సయ్యద్ నసీర్, షేక్ అజహర్, సిరాజుద్దీన్, సహారా బేగం నియమితులయ్యారు. బోధన్ తహసీల్దార్ ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మున్సిపల్ చైర్పర్సన్ తూము పద్మావతి శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

రుద్రూర్, నవంబర్ 15 : ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన డాక్టర్ విశ్వనాథ్ మహాజన్‌ను పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల యోగా ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఇందూర్ జ్యోతి, డి.సతీశ్, ఉప్పు అశోక్, స్రవంతిని సత్కరించారు. మండల కేంద్రంలోని యోగా హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.సాయిలు, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ మండల అధ్యక్షుడు కేవీ మోహన్, ప్రకృతి యోగా తెలంగాణ కార్యదర్శి సాయిలు, పతాంజలి యోగా సమితి అధ్యక్షుడు నూత్‌పల్లి బాలరాజ్, పలు యోగా ఇన్‌స్పెక్టర్లు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు

నందిపేట్, నవంబర్ 15: మండలంలోని వెల్మల్ గ్రామంలో శ్రీబాలాజీ సత్సంగం వార్షికోత్సవాల్లో భాగంగా ఇందూర్ జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీలను శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల 1 నుంచి 13 వరకు నిర్వహించిన శ్లోకాల పోటీల్లోప్రతిభ చూపిన విద్యార్థులను రెండో దశ పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ పోటీలు వర్నిలో జరగనన్నాయని ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను గుర్తించి ఒక్కొ విభాగంలో ఐదుగురు చొప్పున జూనియర్ సీనియర్లతో కలిపి 10 మందిని ఎంపిక చేసి మూడో స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలను నందిపేట్ కేదారేశ్వర ఆశ్రమంలో మంగిరాములు మహరాజ్ సమక్షంలో నిర్వహించనున్నట్లు బాలాజీ సత్సంగ్ నిర్వాహకులు కృష్ణకుమార్ తెలిపారు.

భగవద్గీత శ్లోకాలను వినిపిస్తున్న విద్యార్థినులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MARIKINDI ABHILASH, S/o. Nadpi Rajanna, H.No. 6-20/1, Pachalanadukuda, (M) Velpur, Dist. Nizamabad has Changed My Surname/Name as MARRIKINDI VENKATI.
NT-326716

CHANGE OF NAME

★I, MARIKINDI RADHA, W/o. Marrikindi Venkati, H.No. 6-20/1, Pachalanadukuda, (M) Velpur, Dist. Nizamabad, TG. has Changed My Surname/Name as MARRIKINDI JYOTHI.
NT-326716

CHANGE OF NAME

★I, MARIKINDI CHINNA VENKAT RAJAN, H.No. 6-2011, Parhalana Pachala Nadukuda, (M) Velpur, Nizamabad Dist., TG. has Changed My Surname/Name as MARRIKINDI NADPI RAJANNA.
NT-326716

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.